సాక్షి వనపర్తి


శనివారం । 14 । జనవరి । 2023



72 గంటల్లో ఛేదించారు

జాతీయ రహదారిపై ఈ నెల 9న జరిగిన దోపిడీ కేసును 72 గంటల్లోనే ఛేదించారు.

వివరాలు 8లో ▸



ఎత్తం గట్టు ముస్తాబు

కోడేరు మండలం ఎత్తంగట్టు రామలింగేశ్వర ఆలయం వేడుకలకు ముస్తాబైంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /16.3

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది. ఉదయం, రాత్రి చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

29 నుంచి హాజీమలాంగ్ బాబా ఉర్సు



అమరచింత: మండలంలోని మస్తీపురం గుట్టపై వెలిసిన సయ్యద్‌షా హజ్రత్ హాజీమలాంగ్ బాబా ఉర్సు ఈ నెల 29 నుంచి 31 వరకు కొనసాగుతుందని ముర్షద్ మైనుద్దీన్ తెలిపారు. 29న గంధోత్సవం, 30న ఉర్సు, 31న ఫాతేహాలు ఉంటాయన్నారు. ఉర్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని.. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్గా వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ధరలు తగ్గించడం సరికాదు : సీపీఐ



వనపర్తి: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో తేమశాతం పేరుతో రైతులు తీసుకొచ్చిన పంట ఉత్పత్తుల ధరలను తగ్గించి కోడ్ చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కె.శ్రీరామ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మార్కెట్‌యార్డులోని వేరుశనగ విక్రయాలను పరిశీలించారు. వేరుశనగలో తేమశాతాన్ని అశాస్త్రీయంగా అంచనా వేసి ధరలు నిర్ణయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మార్కెట్‌కు వచ్చిన పలువురు రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నామని, కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారన్నారు. కుప్పల అడుగులు పేరుతో ఒక్కో రైతు నుంచి 50 నుంచి 100 కిలోల వేరుశనగను తూకం చేయకుండా తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. సమస్యలను కార్యదర్శి లక్ష్మయ్యకు వివరించగా.. అడుగులు తీసుకోవటంపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. ఆయన వెంట జిల్లా కార్యవర్గసభ్యుడు రమేష్, మండల కార్యవర్గసభ్యుడు లక్ష్మీనారాయణ, నాయకుడు కుర్మయ్య తదితరులు ఉన్నారు.

నేడు గోదారంగనాథస్వామి కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ఉదయం 11 గంటలకు గోదారంగనాథ కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని కనులారా తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పేర్కొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు సుప్రభాతసేవ, తిరువారాదన, తిరుప్పావై పారాయణ, అద్య మహోత్సవ ప్రబంద పారాయణం, స్వప్నము, శాత్తుముల్లై, తీర్థ ప్రసాద గోష్టి వంటి ప్రత్యేక పూజలను వేదమంత్రోచ్ఛరణలతో ఘనంగా చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అర్చకులు భువనస్వామి, దినకరన్ ఆచార్యులు, శ్రీదత్తు, శ్రీవెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆనందగిరిపై..

బిజినేపల్లి: మండల కేంద్రంలోని ఆనందగిరి కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదా రంగనాయకస్వామి కల్యాణం శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తులు సంప్రదాయ దుస్తులతో స్వామివారి కల్యాణంలో పాల్గొనాలని సూచించారు.

మొక్కజొన్న క్వింటా రూ.2,261

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగ గరిష్ఠంగా రూ.8,363, కనిష్ఠంగా రూ.5,430 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,261, కనిష్ఠంగా రూ.2,250 ధర పలికింది. ధాన్యం హంస రకం రూ.1,755, ఆర్ఎన్ఆర్ రకం రూ.2,265, సోనామసూరి రూ.1,709, కందులు గరిష్ఠంగా రూ.7,124, కనిష్ఠంగా రూ.6,676, ఆముదాలు రూ.6,192 ధరలు లభించాయి.

భోగభాగ్యాల భోగి

- సంప్రదాయాల సమ్మేళనమే సంక్రాంతి
- కీడు పండుగంటూ శుభకార్యాలకు దూరం
- ఇంటిముంగిట రంగురంగుల రంగవల్లులు



ఆత్మకూర్‌లో భోగిమంటలు (ఫైల్)

ఆత్మకూర్/వనపర్తి టౌన్:

రంగురంగుల రంగవల్లులు, హరిదాసుల కీర్తనలు, బసవన్నల విన్యాసాలు, గాలిపటాల రెపరెపలు సంక్రాంతి పండుగ ప్రత్యేకం. శనివారం భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగలు జరుపుకొనేందుకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. కుటుంబ బంధాలు, సంప్రదాయాలను తెలియపర్చే పండుగల్లో సంక్రాంతి ఒకటిగా చెప్పుకోవచ్చు. పల్లెలు, పట్టణాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. పిల్లల ఆటపాటలు, బంధువుల రాకతో గ్రామాలు సందడిగా మారాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడంతో పట్టణాల్లో ఉండే వారంతా కుటుంబ సభ్యులతో సొంతూర్లకు చేరుకున్నారు. విద్యాసంస్థల్లో గురువారమే ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకొన్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పలుగ్రామాల్లో ప్రజాప్రతినిధులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

కీడు పండుగంటూ..

తెలంగాణలో ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సంక్రాంతి పండుగను చాలామంది కీడు పండుగగా పేర్కొంటారు. ప్రారంభోత్సవాలు, వివాహాలు తదితర శుభకార్యాలను పండుగయ్యాకే జరుపుకొంటారు.



జిల్లాకేంద్రంలోని మార్కెట్‌లో రద్దీ



వనపర్తిలో ముగ్గుపిండి కొనుగోలు చేస్తున్న మహిళలు

భోగి..

భోగి రోజున ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి అందులో ఆవు పేడతో తయారు చేసి గొబ్బెమ్మలను ఉంచి అలంకరిస్తారు. తెల్లవారుజామున కాలనీలు, గ్రామాల్లో భోగి మంటలు వేయడం కనిపిస్తుంది. నువ్వుల రొట్టెలు భోగి ప్రత్యేకం.

కిటకిటలాడిన మార్కెట్లు..

శుక్రవారం జిల్లాకేంద్రంలోని కమాన్‌చౌరస్తా, గాంధీ చౌరస్తా, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, వివేకానంద చౌరస్తా తదితర ప్రాంతాల్లోని దుకాణాలు జనంతో రద్దీగా కనిపించాయి. పూలు, పండ్లతో పాటు ముగ్గులను అలంకరించేందుకు రంగులు తదితర వాటిని కొనుగోలు చేస్తూ కనిపించారు.

ఉత్సవాలకు ముస్తాబు

నేటి నుంచి చింతలకుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

- వివిధ ప్రాంతాల నుంచి భారీగా రానున్న భక్తులు



చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో..) స్వామివారి మూల విగ్రహం

పెబ్బేరు: మండలంలోని పాతపల్లి శివారు చింతలకుంట ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. కోరిన కోర్కెలు తీరుతుండటంతో భక్తులు భారీగా స్వామివారిని దర్శించుకుంటారు. ఏటా సంక్రాంతి నుంచి మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు స్థానికులేగాకా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు.

ఆలయ చరిత్ర..

ఈ ఆలయానికి సుమారు 300 ఏళ్ల చరిత్ర ఉంది. అడవికి వెళ్లిన పశువుల కాపరులు ముందుగా స్వామివారి విగ్రహాన్ని గుర్తించి వారితో పాటు స్థానికులు ప్రత్యేక పూజలు చేయడం ప్రారంభించారని.. కోరిన కోరికలు తీరుతుండడంతో ఆనోట ఈనోట వెలుగులోకి వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. శ్రీరంగాపురం వాసుదేవరావు ఆలయాన్ని నిర్మించడం, ఆలయం చింతలచెరువు సమీపంలో ఉండడంతో చింతలకుంట ఆంజనేయస్వామి అని పేరొచ్చింది.

పెరుగుతున్న భక్తులు..

ప్రతి ఏటా భక్తులసంఖ్య పెరుగుతోందని ఆలయ పూజారి నంబి వెంకటేశ్వర్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బారికేడ్లు, వాహనాల పార్కింగ్, తాగునీటి వసతిని కొందరు యువకులు స్వచ్ఛందంగా చేపడుతున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆలయ ఆవరణలో తినుబండారాలతో పాటు బొమ్మలు, ఆట వస్తువులు, అలంకరణ వస్తువులు విక్రయించే దుకాణాలు వెలిశాయి.

మాంసమే నైవేద్యం..

ఇతర ఆలయాలకు భిన్నంగా ఇక్కడ స్వామివారికి మాంసాన్ని భక్తులు నైవేద్యంగా సమర్పిస్తారు. కోళ్లు, పొట్టేళ్లను బలిస్తారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలు, బైక్‌లు, ఆటోలకు పొట్టేళ్లను బలిచ్చి పూజలు చేస్తారు.

'కంటివెలుగు'కు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా, చిత్రంలో అదనపు కలెక్టర్లు ఆశిష్ సంగ్వాన్, వేణుగోపాల్ తదితరులు

- కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా

వనపర్తి: రెండోవిడత కంటివెలుగు విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, వైద్యాధికారులతో సీఎస్ శాంతకుమారి నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలు, అయిదు పురపాలికల్లోని 80 వార్డుల్లో శిబిరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వందరోజుల్లో 3,788 వైద్య శిబిరాలు నిర్వహించి జిల్లాలోని 4.52 లక్షల మందికి కంటి పరీక్షలు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. అనంతరం ఈ విషయమై జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శిబిరాలు నిర్వహించే సమాచారాన్ని ముందుగానే గ్రామస్తులకు చేరవేసేలా చూడాలని సూచించారు. క్యాంపు సిబ్బందికి భోజనం, ఇతర వసతులు కల్పించాలని, అధికారులు రోజు పర్యవేక్షించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఆశిష్ సంగ్వాన్, వేణుగోపాల్, డీఎంహెచ్‌ఓ డా. రవిశంకర్, డీపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2023 డైరీని శుక్రవారం కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘాలు వారి హక్కులను కాపాడుకోవటంతో పాటు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సీజీ విష్ణువర్ధన్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దామోదర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే జిల్లాకు సముచితస్థానం

- అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

వనపర్తి: పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థల పరిపాలన సమర్థవంతంగా నిర్వహించడంలో రాష్ట్రంలోనే జిల్లాకు సముచిత స్థానం లభించిందని అదనపు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక చిల్డ్రన్‌హోమ్‌లో తన జన్మదిన వేడుకలు జరుపుకొన్నారు. జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి, డీడబ్ల్యూఓ కాశీక్రాంతి, డీఆర్‌డీఓ పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. కొత్త పంచాయతీరాజ్ చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల విభాగంలో పనిచేసే జిల్లా, మండల, గ్రామ, మున్సిపాలిటీల్లోని అధికారుల పనితీరు బాగుందని ప్రశంసించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కమిషనర్ విక్రమసింహారెడ్డి, డీఈ సూర్యనారాయణ, ఏఈ భాస్కర్ అదనపు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

డూడూ బసవన్న

అయ్యవారికి.. అమ్మవారికి దండంపెట్టు

- సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దు ప్రత్యేకం



జడ్చర్ల టౌన్: డూడూ బసవన్న అనగానే సంక్రాంతి సంబరాల్లో గంగిరెద్దు గుర్తుకు వస్తుంది. భోగి మొదలు కనుమ వరకు మూడు రోజులపాటు గంగిరెద్దులను ఇంటింటికి తిప్పుతూ గంగిరెద్దుల వాళ్లు చేసే విన్యాసాలు చిన్నారులను ఎంతగానో అలరిస్తాయి. రెండు మూడు దశాబ్దాల కిందటి వరకు నాలుగైదు ఊర్లలో మూడు నాలుగు కుటుంబాలు ఉండే గంగిరెద్దుల వాళ్లు ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా వంద కుటుంబాలు మాత్రమే మిగిలాయి. గంగిరెద్దులను ఆడించేవారు యాదవ కులానికి చెందిన వారే అయినప్పటికీ వారితో సంబంధాలు అంతంత మాత్రమే. వీరిది అంతా సంచార జీవనమే. యాచక వృత్తి ప్రధానంగా జీవిస్తుంటారు. పండగలు, పర్వదినాలతోపాటు ఎవరైనా మరణిస్తే అక్కడ ప్రత్యక్షం అవుతుంటారు. ముఖ్యంగా పంటలు చేతికి వచ్చే సమయానికి గంగిరెద్దులతో.. ఊరూరా సంచరిస్తూ జీవనం గడుపుతుంటారు.

ఆకట్టుకునేలా అలంకరణ

ఎద్దుకు వారు చెప్పినట్లుగా ఆడేలా శిక్షణ ఇచ్చి అలంకరిస్తారు. గోపురం నుంచి తోక వరకు ఎంతో అందంగా రంగు రంగులతో కుట్టిన బొంతలు, పాత పట్టు చీరలను అలంకరిస్తారు. కొమ్ములను రింగులతో అందంగా తీర్చిదిద్ది వాటికి గొట్టాలను ధరింపజేసి రంగురంగుల ఊలు దారాలను చుడతారు. నొసటిభాగంలో తోలుతో అలంకరించి పైన గవ్వలు వేలాడదీస్తారు. కాళ్లకు గజ్జెలు కట్టి ఆడిస్తుంటారు. ఎవరైనా పాత పట్టుచీరలు, చీరలు, దుస్తులు ఇచ్చినప్పుడు వాటికి వారి ముందే అలంకరిస్తుంటారు. ముకుతాడు కట్టి దానిని ఆడించేవారు ఓ చేత్తో పట్టుకుని నైపుణ్యం ప్రదర్శిస్తారు.

తల ఊపుతూ.. కాళ్లు కదుపుతూ

అయ్యవారికి దండంపెట్టు.. అమ్మవారికి దండంపెట్టు ఈ ఇంటికి మంచి జరుగుతదని చెప్పు అంటూ గంగిరెద్దును ఆడించేవారు అనగానే తల ఊపి అవునన్నట్లుగా సమాధానం ఇస్తుంది. ఏమప్పా రాముడు నీ భార్య సీతమ్మ, తమ్ముడు లక్ష్మణ్, బంటు హనుమంతు అయ్యగారింటికి సంక్రాంతి పండగ పూట వచ్చాం. వారిచ్చే గో, ధన, ధాన్యాలు తీసుకుని ఇంటిముందే పేడపెట్టు, గోపంచకం పోయి వారికి మంచి జరుగుతది. బసవన్నా వారిచ్చింది తీసుకుని పిల్లలకు నీ ఎడం కాలుతో దిష్టితీసెయ్ అనగానే ఎడమకాలును తిప్పుతుంది. ఆడించేవారు చెప్పినట్లుగా తల ఊపుతూ, కాళ్లు కదుపుతుంటే గజ్జెల శబ్దంతో ఆకట్టుకుంటుంది.

సన్నాయి, బూర, పాత కోటు

గంగిరెద్దును ఆడించే వారి వేషధారణ సైతం ప్రత్యేకంగానే ఉంటుంది. వారి చేతిలో సన్నాయి, బూర, చిన్న గంట పట్టుకుంటారు. ఎవరైనా పాతకోటు ఇస్తే అది వేసుకుని తిరుగుతుంటారు.

ఆదరణ తగ్గింది..



మా గ్రామం చర్లపల్లి అయినా పెద్దల నుంచి వచ్చిన గంగిరెద్దులను ఆడించడం కోసం సంచార జీవనం గడుపుతున్నా. నా చిన్నతనం నుంచి ఇదే వృత్తిలో ఊరూరా తిరుగుతుంటా. ఏడాదిలో పండగల పూట మాత్రమే గంగిరెద్దుతో తిరిగి యాచకం చేస్తా. ఇంతకు ముందు అయితే ధనం, ధాన్యం, గడ్డి అన్ని దానం చేసేవారు. ఇప్పుడు పూర్తిగా ఆదరణ తగ్గిపోయింది.

– రాములు, గంగిరెద్దులను ఆడించే వ్యక్తి

'హాత్ సే హాత్ జోడో' విజయవంతం చేద్దాం

- మాజీ మంత్రి చిన్నారెడ్డి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

ఖిల్లాఘనపురం: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టే హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్రను విజయవంతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సంఘటితం కావాలని మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రకు దేశంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని.. అలాగే రాష్ట్ర అధ్యక్షుడు చేపట్టే యాత్రను ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి, వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకరావడానికి ఈ యాత్ర ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త పని చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌ప్రసాద్, మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీలు విజయలక్ష్మి, మల్లేష్‌యాదవ్, నాయకులు రవి, దేవన్న యాదవ్, దివాకర్ యాదవ్, రోహిత్, పెంటయ్య, విజయ్‌కుమార్, వాస నాగేశ్వర్, దేవిజానాయక్, వెంకట్రాములుగౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కలిసిరావాలి..

గోపాల్‌పేట: కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కలిసి రావాలని మాజీ మంత్రి చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తాడిపర్తిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత్ జోడోయాత్ర దేశ చరిత్రలో నిలిచిపోయేలా ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని తెలిపారు. తెలంగాణలో సైతం రేవంత్‌రెడ్డి సకలజనుల సంఘర్షణ యాత్ర తలపెట్టినందున కార్యకర్తల్లో మరింత ఉత్సాహం వచ్చిందన్నారు. యాత్రను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త పాల్గొనాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గణేష్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరహరి, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు.

రెండోరోజు కొనసాగిన రాచాల దీక్ష



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

కొత్తకోట: పట్టణంలోని చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష శుక్రవారం రెండోరోజు కొనసాగింది. దీక్షకు కాంగ్రెస్, టీడీపీ, సీపీఎం, బీఎస్పీ శ్రేణులు సంఘీభావం ప్రకటించాయి. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సత్యంసాగర్ మాట్లాడుతూ.. కానాయపల్లి, శంకర సముద్రం నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఏళ్లుగా నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా బాధిత రైతులను తీవ్ర క్షోభకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టుల మీద ఉన్న ధ్యాస ప్రజా సమస్యలపై లేదని.. త్వరలోనే ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలను ఆధారాలతో బయటపెడతామని తెలిపారు. రాచాల యుగంధర్‌గౌడ్ రెండురోజులుగా దీక్ష చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, ఆయన ఆరోగ్యానికి ఏం జరిగినా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కానాయపల్లి నిర్వాసితుల పునరావాసంలో భాగంగా 18 ఏళ్లు నిండిన వారికి ప్లాట్లు, ఆర్‌అండ్‌ఆర్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సీ–ఫామ్ డబ్బులు అందరికి ఒకే విధంగా జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైద్యులు యుగంధర్‌గౌడ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. అంజన్నయాదవ్, మహేందర్‌నాయుడు, శేఖర్‌గౌడ్, స్వామినాయుడు, భరత్‌కుమార్, తిరుపతయ్యగౌడ్, ప్రశాంత్, బోయేజ్, గొల్లబాబు, శేఖర్‌రెడ్డి, నిక్సన్, మాసన్న, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

గద్వాల క్రైం: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం పట్టణంలోని జమ్మిచేడ్‌కాలనీలో చోటు చేసుకుంది. బంధువుల కథనం మేరకు.. నాలు గోవార్డు కౌన్సిలర్ నర్సింహులు కుమారుడు విష్ణు (25) ఉదయం ఇంట్లో స్నానం చేసి బయటకు వచ్చాడు. ఫోన్ రావడంతో ఛార్జింగ్ పెట్టిన మొబైల్ వైరును తీసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎనిమిది నెలల క్రితమే విష్ణుకు వివాహమైంది.

బాత్‌రూంలో బల్బు తీస్తుండగా ..

బాలానగర్: విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని గౌతాపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ జయప్రసాద్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వస్పుల రాజశేఖర్(30) అతని ఇంట్లో గురువారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో బాత్‌రూంలో బల్బు తీస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై రాజశేఖర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిప్పంటించుకుని బలవన్మరణం

తెలకపల్లి: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు కథనం ప్రకారం.. మండలంలోని ఆలేరుకు చెందిన మేడిపూర్ పాపయ్య(23) ఈ నెల 9న ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. పరశురాములు తల్లి కూడా నెలరోజుల క్రితమే అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో మనస్తాపానికి గురై అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. పాపయ్యకు భార్య, కొడుకుతోపాటు తండ్రి లక్ష్మయ్య ఉన్నాడు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

గద్వాల క్రైం: జమ్మిచేడ్‌కాలనీకి చెందిన వీరన్న (38) ఈ నెల 9న పురుగు మందు తాగాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. వీరన్నకు భార్య మహేశ్వరి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

భార్యాభర్తలకు ఏడాది జైలుశిక్ష

ఆత్మకూర్: వ్యక్తిపై అకారణంగా దాడిచేసిన ఘటనలో భార్యాభర్తలకు ఏడాదిపాటు జైలు శిక్ష విధించినట్లు సీఐ కేవీఎస్ రత్నం, ఎస్ఐ మహేష్‌గౌడ్ తెలిపారు. మండలంలోని మస్తీపూర్‌కు చెందిన ఎల్లగట్టు అంజిరెడ్డి, అనసూయమ్మ దంపతులు 2014లో పొలం తగాదాలో మహేష్ అనే వ్యక్తిపై దాడిచేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. శుక్రవారం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో వాదనల అనంతరం నిందితులు చేసిన తప్పును అంగీకరించడంతో న్యాయమూర్తి శిరీష ఏడాదిపాటు జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బక్తియార్‌బాబ, కోర్టు కానిస్టేబుల్ అబ్దుల్‌ఖాదర్‌లు ఉన్నారు.

72 గంటల్లో ఛేదించారు!

- అంతర్రాష్ట్ర దారి దోపిడీ కేసులో పోలీసుల స్పందన
- ముగ్గురు నిందితుల అరెస్ట్.. పరారీలో ఐదుగురు
- డీసీఎం, కారు, స్కూటీ, దేశీయ పిస్టల్, 17 రౌండ్స్ స్వాధీనం
- దోపిడీకి గురైన రూ.6లక్షల ఐరన్ రికవరీ
- వివరాలు వెల్లడించిన జోగులాంబ గద్వాల ఎస్పీ


సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రంజన్ రతన్‌కుమార్

ఎర్రవల్లి చౌరస్తా: జాతీయ రహదారి–44పై ఈ నెల 9న జరిగిన దారి దోపిడీ కేసును పోలీసులు కేవలం 72గంటల్లోనే ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం కోదండాపురం సీఐ కార్యాలయంలో ఎస్పీ రంజన్ రతన్‌కుమార్ వెల్లడించారు. ఏపీలోని వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌కు చెందిన గంట విలియం లారీ డ్రైవర్ పనిచేస్తున్నాడు. తన ఓనర్ షేక్ మంజూర్‌బాషా సూచన మేరకు ఏపీ 12వీ 9848 నంబర్ గల లారీలో ఈ నెల 9న హైదరాబాద్ నుంచి ఐరన్ పైపులు, కడ్డీలు, రేకులు వేసుకొని బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై వేముల స్టేజీ సమీపంలోకి రాగానే నంద్యాల జిల్లా ప్యాబిలీకి చెందిన పఠాన్ మహ్మద్ రఫీ, వడ్ల రామాంజనేయులు, ఓబులేష్, విజయవాడ టౌన్‌కు చెందిన షేక్ జాఫర్‌తో పాటు మరో నలుగురు వ్యక్తులు కలిపి ఐరన్ లారీకి డీసీఎంను అడ్డు పెట్టి డ్రైవర్‌ను కొట్టి భయపెట్టి కారులో ఎక్కించుకొని కాళ్లు, చేతులు కట్టేసి అతని వద్ద ఉన్న రూ.4వేల నగదు, మొబైల్ లాక్కున్నారు. అనంతరం లారీని వేముల శివారులో ఉన్న జూరాల కాల్వ పైకి తీసుకెళ్లి ఇనుప సామగ్రిని తమ డీసీఎంలోకి వేసుకొని వెళ్లిపోయారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్ గంట విలియం ఫిర్యాదు మేరకు కోదండాపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. అలంపూర్ సీఐ సూర్యనాయక్ ఆధ్వర్యంలో 20మంది పోలీస్ సిబ్బంది రంగంలోకి దిగి సాంకేతిక మానవీయ, పరిజ్ఞానంతో 72 గంటల్లోనే కేసును ఛేదించి ముగ్గురు నిందితులు రఫీ, రామాంజనేయులు, జాఫర్‌ను అరెస్టు చేయగా.. ఓబులేష్‌తో పాటు అతను తీసుకొచ్చిన నలుగురు పరారీలో ఉన్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం అలంపూర్ కోర్టులో హాజరుపర్చారు. వారి నుంచి రూ.4 వేల నగదు, డీసీఎం, కారు, స్కూటీ, దేశీయ పిస్టల్, 17 రౌండ్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే దోపిడీకి గురైన రూ.6 లక్షల విలువైన ఐరన్ సామగ్రిని రికవరీ చేశారు.


పోలీసులు రికవరీ చేసిన ఐరన్ సామగ్రి

నిందితుల వివరాలు..

నిందితుడు ఏ1 పఠాన్ మహ్మద్ రఫీ 2000 సంవత్సరంలో సౌదీ అరేబియా వెళ్లి 2009లో తిరిగి వచ్చి పెళ్లి చేసుకొని ఐరన్ షాపు పెట్టుకొని రియల్ ఎస్టేట్ చేయగా వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. అలాగే ఏ2 వడ్ల రామాంజనేయులు మాజీ ఆర్మీ కాగా.. పండ్ల వ్యాపారం పెట్టుకోగా.. అతనికి సైతం నష్టాలు వచ్చాయి. దీంతో ఇద్దరు కలిసి ఐరన్‌ను దొంగిలించాలని పథకం పన్నారు. దీని కోసం ఆయుధం కావాలని వలపన్ని ఏ1 తుపాకీ కొనాలని ఏ2కి రూ.1.50 లక్షలు ఇవ్వగా.. ఏ2 ఉత్తరప్రదేశ్‌లోని మధురకు వెళ్లి ఒక కంట్రీ మేడ్ తుపాకీ, 20 రౌండ్స్ కొనుకొచ్చారు.

నేరం చేశారిలా..

నిందితులు అనుకున్న విధంగా ఈ నెల 3న ఏ1, ఏ4 కలిసి జాతీయ రహదారిపై ఏదైనా లారీలో ఇనుప సామగ్రి దొంగిలించాలని నిర్ణయించారు. ఈ మేరకు టాటా ఇండికా కారులో వెళ్లి అమడబాకుల గ్రామం సమీపంలో రోడ్డుకు కొంచెం దూరంలో ఆగి ఏ2 ఒక రౌండ్ గాల్లోకి కాల్చగా.. ఏ1 రఫీ సైతం రెండు రౌండ్లు గాల్లోకి కాల్చాడు. చోరీ చేయడానికి నలుగురు సరిపోరని మరో నలుగురు కావాలని రఫీ.. రామాంజనేయులు, ఓబులేష్‌కు చెప్పగా.. ఓబులేష్ మరో నలుగురిని తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 9న రఫీ, రామాంజనేయులు, జాఫర్, ఓబులేష్‌తో వచ్చిన నలుగురు కలిసి అడ్డాకుల టోల్‌గేట్ నుంచి ఐరన్ లోడుతో వెళ్తున్న లారీని డీసీఎంలో అనుసరించారు. పెబ్బేరు సమీపంలోకి రాగానే లారీకి డీసీఎం అడ్డుపెట్టగా డ్రైవర్ తప్పించుకొని పారిపోయాడు. రాత్రి 8 గంటల సమయంలో తిరిగి అదే ఐరన్ లారీకి డీసీఎంను అడ్డు పెట్టి డ్రైవర్‌ను కొట్టి భయపెట్టి కారులో ఎక్కించుకొని కాళ్లు, చేతులు కట్టేసి అతని వద్ద ఉన్న రూ.4 వేల నగదు, మొబైల్ లాక్కున్నారు. అనంతరం లారీని వేముల శివారులో ఉన్న జూరాల కాల్వ పైకి తీసుకెళ్లి లారీలో ఉన్న ఇనుప సామగ్రిని తమ డీసీఎంలోకి వేసుకొని డ్రైవర్‌ను రోడ్డుపై వదిలివెళ్లారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులను ప్రదానం చేశారు. సమావేశంలో డీఎస్పీ రంగస్వామి, సీఐ సూర్యనాయక్, సీసీఎస్ సీఐ వెంకటేష్, ఎస్ఐలు వెంకటస్వామి, శ్రీహరి, బాలరాజు, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS
LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 9010234478, 9951602829, 9705346172. గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

కత్తెర పురుగు నివారణకు చర్యలు

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


సాగులో ఉన్న మొక్కజొన్న

అలంపూర్: జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో మొక్కజొన్న పంటలు అధికంగా సాగు చేశారు. పంటలో కత్తెర పురుగు ఆశించడానికి అవకాశం ఉంది. కత్తెర పురుగు నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు నివారణకు సలహాలు, సూచనలు వివరించారు. యాసంగిలో పంట మొలక దశ నుంచి కొంత ఏపుగా పెరగడంతో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తేనే ఆశించిన దిగుబడి సాధించవచ్చని పేర్కొన్నారు.

నివారణ

కత్తెర పురుగు ఆశించిన పంటకు ముందుగా వేప నూనె 1,500 పీపీఎంలను 5 లీటర్ల నీటికి క్లోరిపైరిఫాస్ 50 మి.లీ.తో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. తర్వాత థయోమిథాక్సమ్ 12.6 శాతం, లామ్డాసైహలోథ్రిన్ 9.5 శాతం, ఎస్‌సీ 0.5 మి.లీ. లేదా క్లోరాన్ ట్రనోలిపోల్ 18.5 శాతం ఎస్‌సీ 0.4 మి.లీ లేదా స్పైనోటోరమ్ 11.7 శాతం ఎస్‌సీ 0.5 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలని వివరించారు. ఎకరాకు 8 చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకొని పురుగు ఉధృతి నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.


సూక్ష్మధాతువు లోపం ఉన్న చీని ఆకులు

చీనిలో సూక్ష్మధాతు లోపాలు

చీని తోటల్లో వేరు కుళ్లు, సూక్ష్మధాతు లోపాలను గుర్తించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. చీని పంటలో వేరుకుళ్లు తెగులు ఆశించడానికి అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ తెగుళ్లు ఆశించిన మొక్కల వేర్లు మొదట నల్లగా మారి బెరడు తీసి వేసిన వెంటనే వస్తాయి. ఈ తర్వాత చెట్లు ఒకదాని తర్వాత ఒకటి చనిపోతాయని తెలిపారు.

నివారణ

ఈ తెగులు నివారణకు బావిస్టన్ గ్రాము లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లలో ద్రావణాన్ని పోయాలి. ఈ పద్ధతి ఒకటి నుంచి రెండు సార్లు 15 రోజుల పాటు పాటించాలి. అదేవిధంగా చీని తోటల్లో సూక్ష్మధాతువు లోపాలను గుర్తించామన్నారు. దీంతో ఆకుల మధ్య ఈనెలు పసుపు పచ్చ రంగుగా మారి తర్వాత ఆకులు రాలిపోతాయి. దీని నివారణకు ఫార్ములేషన్ 4 లేదా 6 (5 గ్రాములు) లీటరు నీటికి కలిపి ఆకుల మీద పడే విధంగా పిచికారి చేసుకోవాలని సూచించారు. చీని తోటలో వేరు కుళ్లు తెగులు నివారణకు ట్రైకోడర్మా విరిడి 5 కిలోలు, 50 కిలోల పేడలో వేసుకొని వారం రోజుల తర్వాత మొక్క మొదల్లో వేసుకోవాలని సూచించారు. దీని వలన ట్రైకోడర్మా విరిడి వేరు కుళ్లు కలగజేసే శిలీంధ్రాన్ని ఆశించి వేరు కుళ్లు రాకుండా కాపాడుతుంది.



పొలం పనుల్లో విద్యార్థులు

ధరూరు: ప్రభుత్వం గురువారం నుంచి అయిదు రోజుల పాటు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో మండలంలోని వివిధ గ్రామాల రైతుకూలీల పిల్లలు పొలంబాట పట్టారు. మండలంలోని నెట్టెంపాడు శివారులో గురువారం విద్యార్థులు మిరప కాయలు తెంచుతూ కనిపించారు. బాలకార్మికులు అనే మాట పక్కనబెడితే.. సెలవు రోజుల్లో పని చేసుకొని వచ్చిన డబ్బులతో కావాల్సిన దుస్తులు, పుస్తకాలు కొనేందుకు వినియోగించుకోనున్నారు. విద్యార్థులను గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో పొలాలకు తరలించడం కొసమెరుపు.

గర్భిణి మృతిపై విచారణ ప్రారంభం

నాగర్‌కర్నూల్ క్రైం: అమ్రాబాద్ మండలం ఎల్మపల్లికి చెందిన గర్భిణిస్వర్ణకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు గత నెల 27న అమ్రాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి, మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లార. ప్రసవం కాగానే తల్లి, శిశువు మృతిచెందారు. ఈ ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ శుక్రవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. అమ్రాబాద్, అచ్చంపేట సీహెచ్‌సీలు, నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్లు, వైద్యులు, ఏఎన్‌ఎంలు, 108 సిబ్బందిని విచారించి పలు వివరాలు సేకరించారు. కమిటీ సభ్యులు డా. కిర్మణయి, డా. జలజ, డా. మాలతి ఒక్కొక్కరిని వేర్వేరుగా ఉదయం నుంచి మధ్నాహ్నం వరకు విచారించారు. పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు.


సిబ్బందిని విచారిస్తున్న ప్రత్యేక బృందం


నేడు మైలారం జాతర


మల్లయ్యస్వామి మూల విగ్రహం

నారాయణపేట: కర్ణాటకలోని యాద్గిర్ జిల్లా మైలాపురం కొండల్లో వెలిసిన మల్లయ్యస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం జరగనున్నాయి. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రా నుంచి భక్తులు శివాయేశ్ కోటిగళ్.. కోటిగే అంటూ స్మరిస్తూ ప్రత్యేక వాహనాల్లో అక్కడికి చేరుకుంటున్నారు. ఆరాధ్య దైవంగా కొలిచే కురమ, యాదవులు మల్లయ్యస్వామికి గొర్రెపిల్లలు, గొంగళ్లను సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన పూజారి మహాలింగేశ్వరస్వామి కొలువైన కొండపై గండజ్యోతిని వెలిగిస్తారు. భక్తులు ఈ దీపాన్ని దర్శించుకొని పునీతులవుతారు. గ్రామశివారులో ఉన్న కోనేరులో స్వామివారి విగ్రహాన్ని అభిషేకించి పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహిస్తారు. గంగస్నానం, పల్లకీసేవ, గొలుసు తెంచే కార్యక్రమం అట్టహాసంగా కొనసాగుతాయి. ఆ ప్రాంత భక్తులు వానాకాలంలో పండిన పంటను రాసులుగా పోసి సమర్పించుకుంటారు. ఉత్సవాలకు వెళ్లే భక్తుల కోసం నారాయణపేట, తాండూర్, గుర్మిట్కల్, యాద్గిర్, రాయచూర్, గుల్బర్గాల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బండారు (పసుపు) చల్లుకుంటూ నూనె, నెయ్యితో నైవేద్యం సమర్పిస్తారు. గంగమాళ్ల వివాహం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కర్ణాటక పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్రహ్మోత్సవాలకు ఎత్తం గట్టు ముస్తాబు

- ఈనెల 14 నుంచి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు
- ఇతర రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న గ్రామస్తులు


ఎత్తం రామలింగేశ్వరస్వామి గట్టు

రామలింగేశ్వర స్వామి మూలవిరాట్

కోడేరు: మండలంలోని ఎత్తం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎత్తం రామన్న గట్టు వెలిసింది. త్రిభుజాకారంలో ఉన్న గట్టు శిఖరంపై శివకేశవ లింగ రూపంలో రామలింగేశ్వరస్వామి దర్శనం ఇస్తారు. 14న మకర సంక్రాంతి పండుగ రోజు అలంకరించి వైభవంగా పూజలు నిర్వహిస్తారు. ఏటా సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు ఎత్తంగట్టు రామలింగేశ్వరస్వామి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. వేడుకలను తిలకించేందుకు వేలాది మంది భక్తులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. సంక్రాంతి పండుగ రోజు స్వామిని దర్శించుకోవడం వల్ల సకల పాపాలు తొలగి కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం.

తరలిరానున్న భక్తులు

రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి స్వామివారికి తలనీలాలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. వేలాది మంది భక్తులు కాలినడకన గట్టుపైకి వస్తుంటారు. గట్టుపై కేవలం రెండు అడుగుల వెడల్పు మాత్రమే ఉంటుంది. కాకతీయుల కాలంలో వేపూర్ హనుమదాసు, గొల్లపల్లి వెంకటదాసు వంటి వారు స్వామిని దర్శించుకున్నారని పూజారి తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు భక్తుల సందడి ఏమాత్రం తగ్గకుండా మొక్కులు తీర్చుకుంటున్నారు. గట్టుపై ఒకసారి కాకుండా మూడుసార్లు వెళ్లి స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగి సుఖసంతోషాలతో ఉంటారని పూజారులు తెలిపారు. నెమళ్లు, రకరకాల పాములు, రంగు రంగుల పక్షులతో గట్టు ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది.


జేసీబీ సహాయంతో రోడ్డు పనులు..

విద్యుత్, తాగునీరు ఏర్పాటు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి కల్పించారు. ఉచిత అన్నదానంతో పాటు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవడం కోసం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు కాకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. గట్టుపైకి వెళ్లేందుకు రోడ్డు పనులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

మహిమగల దేవుడు

ఎత్తం గట్టుపై వెలిసిన రామలింగేశ్వరుడు ఎంతో మహిమ గల దేవుడు. స్వామిని తలచుకుంటూ ఏ పని చేసినా ఖచ్చితంగా నెరవేరుతుంది. సకల పాపాలు తొలగుతాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా భక్తులు వేలాదిగా దర్శించుకుంటారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోలేదు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం రామలింగేశ్వరుడు.

– మురళీధర్, పూజారి

బడి బయటి పిల్లల సర్వే



బడిలో చేర్చిన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

- ఈనెల 19 వరకు కొనసాగనున్న సర్వే
- గుర్తించిన పిల్లలను బడిలో చేర్చుతున్న అధికారులు

మండలాల వారీగా ఇలా..

మండలం	గుర్తించిన విద్యార్థులు	బడిలో చేరిన విద్యార్థులు
పాన్‌గల్	35 మంది	12 మంది
చిన్నంబావి	17 మంది	08 మంది
వీపనగండ్ల	32 మంది	24 మంది

పాన్‌గల్: మండలంలో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. ఈనెల 6వ తేదీ నుంచి కొనసాగుతున్న ఇంటింటి సర్వే ఈనెల 19వ తేదీన ముగియనుంది. విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అనేక కారణాలతో విద్యార్థులు పాఠశాలలకు దూరంగా ఉంటున్నారు. ఇటుక బట్టీలు, కర్మాగారాలు, దుకాణాలు, హోటళ్లు, గొర్రెల కాపరులుగా పనిచేస్తున్నారు. దీనిని గుర్తించిన ఉన్నతాధికారులు పక్కా ప్రణాళికతో వారిని తిరిగి బడిలో చేర్చేందుకు చర్యలు చేపట్టారు. పాన్‌గల్, చిన్నంబావి, వీపనగండ్ల మూడు మండలాల్లో తొమ్మిది మంది సీఆర్పీలు, నలుగురు ఐఈఆర్పీలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఇందులో పాల్గొంటున్నారు.

అవగాహన కల్పించి..

పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాల్లో మొత్తం వారం రోజుల్లో 84 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు గుర్తించారు. 6 నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన వారు 60 మంది, 15 నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారు 24 మంది పిల్లలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. చిన్న వయస్సు కలిగిన బాలికలు ఉన్నట్లయితే కస్తూర్బా, గురుకుల విద్యాలయాల్లో చేర్పించడం లేదా వారికి ఇష్టం లేని పక్షంలో సమీపంలోని పాఠశాలలకు పంపే విధంగా చూస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

గతంలో 14 ఏళ్ల లోపు వారిని నమోదు చేయగా, గతేడాది ప్రత్యేకంగా 15 నుంచి 19 లోపు వయసు ఉండి ఉన్నత విద్య ఆపేసిన వారిని సైతం ఇందులో చేర్చారు. వీరితో పాటు దివ్యాంగులు (ప్రత్యేకావసరాలు కలిగిన వారు) 0 నుంచి 18 ఏళ్ల లోపు పిల్లల వివరాలను గుర్తించాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు 6 నుంచి 14, 15 నుంచి 19 ఏళ్ల లోపు, దివ్యాంగుల వివరాలు మూడు విధాలుగా నిక్షిప్తం చేశారు. ఈనెల 18 వరకు సర్వే పూర్తి చేసి 19 నుంచి 25వ తేదీ లోపు ప్రబంధ్ పోర్టర్‌లో నమోదు చేసి ఈ నెల 30 లోపు జిల్లా విద్యాశాఖకు అందజేయాల్సి ఉంటుంది.

బడిలోనే ఉండాలి



విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు కలిగిన పిల్లలు బడిలో ఉండాలి, తల్లిదండ్రులు వారిని క్రమం తప్పకుండా బడికి పంపించాలి. పిల్లలు బడికి పెద్దలు పనికి అనే నినాదం పాటిస్తూ బడి ఈడు కలిగిన ప్రతి పిల్లవాడిని బడికి పంపించాలి. బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే బాలకార్మిక చట్టం ప్రకారం చర్యలు ఉంటాయనే విషయం గ్రామాల్లో అవగాహన కల్పించాలి.

– బండి శ్రీను, పీఆర్టీయూ నాయకుడు, పాన్‌గల్

బాల కార్మికులను నిర్మూలించాలి



బడి ఈడు పిల్లలను బడికి పంపిస్తూ బాల కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరు తోడ్పాటునందిస్తే అక్షరాస్యత శాతం పెరుగుతుంది. బడి ఈడు పిల్లల చేత పనులు చేయించడం చట్ట ప్రకారం నేరం. స్థానిక ప్రజాప్రతినిధులు తోడ్పాటునందిస్తే ప్రభుత్వ బడులు మరింత బలోపేతం అవుతాయి.

– వెంకటయ్యయాదవ్, సర్పంచ్, దావాజిపల్లి

పక్కాగా సర్వే



విద్యకు దూరంగా ఉన్న పిల్లలను గుర్తించేందుకు పక్కాగా సర్వే నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు మూడు మండలాల్లో 84 మందిని గుర్తించాం. పిల్లలు, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని సమీప పాఠశాలల్లో చేర్పించడం చేస్తున్నాం. బడిఈడు పిల్లలతో ఎవరైనా పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

– లక్ష్మణ్‌నాయక్, ఎంఈఓ, పాన్‌గల్

డ్రమ్ సీడర్‌తో వరి సాగు మేలు



డ్రమ్‌సీడర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో వరి సాగులో డ్రమ్ సీడర్ వినియోగం, ఆయిల్‌పామ్ సాగుపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ సాజీద్ రహమాన్ మాట్లాడుతూ డ్రమ్ సీడర్ ద్వారా వరి సాగు చేయడంతో కూలీలకు, విత్తనాల ఖర్చు కలిపి దాదాపుగా రూ.నాలుగు నుంచి రూ.ఐదు వేలకు వరకు తగ్గుతుందన్నారు. దీంతో పాటు దిగుబడి పెరుగుతుందన్నారు. నారుమడి యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు సాధించొచ్చన్నారు. ఆయిల్‌పాం చేసుకున్న రైతులకు డ్రిప్‌కు ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, పెద్దకారు రైతులకు 80 శాతం సబ్సిడీపై అందిస్తారన్నారు. రైతులు ఒకే పంటను సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, రైతుబంధు సమితి అధ్యక్షుడు యాదగిరిరెడ్డి, ఏఈఓ మహేశ్వరీ, రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



కంభాళాపురంలో..



రేమద్దులలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాన్‌గల్: మండలంలోని రేమద్దులలో రైతు సంఘం జిల్లా కమిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను బస్టాండ్ ఆవరణలో శుక్రవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కొల్లాపూర్ మాజీ ఎంపీపీ గాదెల సుధారాణి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రైతు సంఘం పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమంపై దృష్టి సారించి వారి ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తిరుపతయ్య, సీఐటీయూ నాయకులు వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, వెంకటయ్య, ఆంజనేయులు, నిరంజన్, ఖాజా, బాలస్వామి, కాశన్న, మల్లేష్, రైతులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని కంభాళపురంలో బీఆర్‌ఎస్ నాయకులు నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ క్యాలెండర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, బక్కయ్య, కృష్ణయ్య, మేకల రాజుకుమార్, బాబురెడ్డి, వీరయ్య, లక్ష్మయ్య, భానుప్రకాశ్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'నిర్వాసితుల సమస్యలు మేమే పరిష్కరించుకుంటాం'



మాట్లాడుతున్న రావుల సురేంద్రనాథ్‌రెడ్డి

కొత్తకోట: కానాయపల్లి గ్రామ పునరావాస సమస్యలను తామే పరిష్కరించుకుంటామని ఆ గ్రామ సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు రావుల సురేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కానయపల్లిలో ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ నాయకులు రాచాల యుగంధర్‌గౌడ్ కొత్తకోటలో చేస్తున్న రాజకీయ దీక్ష విరమించుకోవాలని సూచించారు. తమ గ్రామ సమస్యలను తామే పరిష్కరించుకుంటామన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నిర్వాసితులకు ప్లాట్లు, ఆర్ అండ్ ఆర్ బెనిఫిట్స్ వచ్చే విధంగా, గ్రామంలో సర్వే నిర్వహించి 95 మందిని పీఏఎఫ్ జాబితా నుంచి పీడీఎఫ్ జాబితాలోకి మార్చారని తెలిపారు.

18 ఏళ్లు నిండిన వారు యూనిట్‌గా..

18 ఏళ్లు నిండిన వారిని కూడా అర్హులుగా ప్రకటించే విధంగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ ఎకానామిక్స్ సర్వే ఆధారంగా సర్వే నిర్వహించి 29 మందిలో 23 మంది అర్హులుగా గుర్తించడంలో ఎమ్మెల్యే పాత్ర ఎంతో ఉందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో ప్లాట్ల లెవలింగ్ కోసం రూ. 10 లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేసినట్లు వెల్లడించారు. అదేవిధంగా 400 డబుల్ బెడ్‌రూంలు నిర్వాసితుల కోసం ఎమ్మెల్యే కోటా నుంచి కేటాయించామన్నారు. సమావేశంలో టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు నాగన్న, ప్రధాన కార్యదర్శి పెద్దకుర్మయ్య, వార్డు సభ్యులు సాయిలు, మురళీ, ధనుష్, వెంకట్‌కుమార్, శాంతన్న, రామన్‌గౌడ్, రవీందర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, టీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌గౌడ్, గోవర్ధన్, వడ్డె నాగరాజు, బొక్కలన్న తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను జయప్రదం చేద్దాం



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ బంగారు శ్రీనివాసులు

ఆత్మకూర్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే కంటివెలుగు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ కోటేష్, చైర్‌పర్సన్ గాయత్రి, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో కంటివెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 18 నుంచి నిర్వహించే కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు ఇవ్వడంతో పాటు, మందులు, ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింధూజ, డీఆర్డీఓ కృష్ణయ్య, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కోఆప్షన్‌సభ్యుడు మహబూబ్‌పాష, హెల్త్‌సూపర్‌వైజర్లు సామ్రాజ్యలక్ష్మి, సురేందర్‌గౌడ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

గోపాల్‌పేట: ప్రభుత్వం తలపెట్టిన కంటివెలుగు రెండో విడతను విజయవంతం చేయాలని ఎంపీపీ సేనాపతి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆయన రేవల్లి మండల కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రేవల్లి మండలంలోని పాతతండా, చీర్కపల్లి, రేవల్లి, గౌరిదేవిపల్లి, కేశంపేట, నాగపూర్, బండరావిపాకుల, కొంకలపల్లి, గొల్లపల్లి, తల్పునూరు, శానాయిపల్లి, చెన్నారం గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి సెంటర్‌లో సుమారు వారం రోజుల నుంచి పది రోజుల పాటు కంటి వెలుగు కొనసాగుతుందన్నారు. ఆయా సెంటర్లలో స్టాఫ్‌కు, ప్రజలకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైద్య సిబ్బందికి అవగాహన



పాన్‌గల్: మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించే కంటి వెలుగు కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ విజయవంతం చేయాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లకు కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 18ఏళ్ల పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకునేలా గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు.

కాల్వకు మరమ్మతు



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్‌తండాలో కాల్వ ద్వారా సాగునీరు సరఫరా కాక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు రమేష్‌నాయక్ శుక్రవారం తన సొంత ఖర్చులతో కాల్వకు మరమ్మతు చేయించారు. దీంతో సాగునీరు రైతుల పొలాలకు సాఫీగా వెళ్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తండాలోని గుర్రమోని కుంట నుంచి పంట పొలాలకు సాగునీరు రాకపోవడంతో రైతులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో సొంతంగా జేసీబీ యంత్రంతో కాల్వలో పేరుకపోయిన జమ్ము, పిచ్చిమొక్కలు, మట్టిని తొలగించారు. దీంతో తమ పొలాలకు సాగునీరు సాఫీగా వచ్చేందుకు కాల్వను మరమ్మతు చేయించిన రమేష్ నాయక్‌ను తండా రైతులు అభినందించారు.

చిన్నారులకు గాలిపటాల పంపిణీ



వనపర్తి: సంక్రాంతి పండగ సందర్భంగా పట్టణంలోని 24వ వార్డు చిన్నారులకు బీఆర్‌ఎస్ నాయకుడు వజ్రాల రమేష్ సొంత ఖర్చులతో గాలి పతంగులను అందజేశారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయానికి చిన్నారులను పలిపించి న్యాయవాది బాలయ్యతో కలిసి పంపిణీ చేశారు. వార్డులో చిన్నారులు గాలిపతంగులు ఎగుర వేస్తూ.. సంక్రాంతిని సంబరంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణం



ఆత్మకూర్: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణ శివారులోని శ్రీఅష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో శ్రీగోద లక్ష్మీనారాయణస్వామి వారి తిరు కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి అభిషేకం, విశ్వకోసేనారాధన, పుణ్యాహవాచనం, సంప్రోక్షణ, దేవతాఅర్చనం పూజలు చేశారు. అలాగే భక్తులకు అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శేషాచార్యులు, సాకేతాచార్యులు, ఆలయ ధర్మకర్తలు పాషం గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

ఆత్మకూర్: తెలంగాణ దివ్యాంగుల వేదిక ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా బాలకిష్టాపూర్ గ్రామానికి చెందిన హుస్సేన్‌ను నియమించారు. శుక్రవారం ఆసంఘం వ్యవస్థాపకుడు మేకల సమ్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు సుతారి రమేష్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సుమతి నియామక పత్రాన్ని హుస్సేన్‌కు అందజేశారు. దివ్యాంగులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, వారిని చైతన్యవంతం చేసేందుకు కృషిచేస్తానని హుస్సేన్ పేర్కొన్నారు.

పల్లెలకు సంక్రాంతి శోభ



అమరచింత: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో సంబురాలు మొదలయ్యాయి. ఆడపడుచులు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులతో ఇంటి పరిసరాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. మూడు రోజుల పాటు జరిగే పండుగను పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా సరదాగా గడిపేందుకు వలస వెళ్లిన వారు గ్రామాలకు తరలి రావడంతో గ్రామాలు కళకళలాడుతున్నాయి. హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాలు పల్లెల్లో ఆనందాన్ని నింపుతున్నాయి.

చదరంగం పోటీలు ప్రారంభం



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటీశ్రీధర్

వనపర్తి క్రైం: రంగస్వామి స్మారక జిల్లాస్థాయి చదరంగం పోటీలను శుక్రవారం జిల్లా కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ప్రారంభించారు. 13రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో 80 సీనియర్స్, జూనియర్స్ జట్లు పాల్గొంటాయి. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సీనియర్స్ జట్లకు ఐదు, మూడు, రెండు తులాల వెండి నాణెలు, జూనియర్స్‌కు మూడు, రెండు, తులం వెండి చొప్పున బహుకరిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగం క్రీడను విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాలని, దీని ద్వార జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ క్లబ్ మెంబర్ ఆవుల రమేష్, జనరల్ సెక్రెటరీ యాదగిరి, మేఘారెడ్డి, కృష్ణయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడాలి



వనపర్తిలో ముగ్గుల పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వద్ద బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీచైర్మన్ లోకనాథ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంస్కృతి చాటే ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని లోకనాథ్‌రెడ్డి అన్నారు. న్యాయ నిర్ణేతలుగా మహిళ మోర్చ జిల్లా అధ్యక్షురాలు కల్పన, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి వ్యవహరించారు. ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన భార్గవికి రూ.5వేలు, రెండోస్థానంలో నిలిచిన సంధ్యకు రూ.3వేలు, మూడో స్థానంలో నిలిచిన వైష్ణవికి రూ.2వేల నగదు బహుమతులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా కార్యదర్శి పరశురాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి శివ, జహంగీర్, రవి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మానాజీపేటలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటలో డయల్ యువర్ విలేజ్ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సెమినార్, క్విజ్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులు వేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసినట్లు డయల్ యువర్ విలేజ్ టీమ్ సభ్యులు శ్రీకాంత్, యాదయ్య, దిలీప్, రాహుల్, నాగయ్య తెలిపారు. సర్పంచ్ సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

రూ.1.98 కోట్లు రైతు ఖాతాల్లో జమకాలే ..



తూంకుంటలో వరిధాన్యాన్ని లోడ్ చేస్తున్న హమాలీలు (ఫైల్)

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో తూంకుంట సింగిల్ విండో ద్వారా వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన వరిధాన్యానికి నేటికీ రూ.1.98కోట్లు రైతుల ఖాతాల్లో జమకాలేదు. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. తూంకుంట సింగిల్ విండో ద్వారా 8 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో 1,02,132 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని 2,080 మంది రైతుల నుంచి సేకరించారు. అందులో 240 మంది రైతులకు సంబంధించిన 9,901 క్వింటాళ్ల డబ్బులు నేటికీ ఖాతాల్లో జమకాలేదు. వరిధాన్యాన్ని విక్రయించి దాదాపు 25 రోజులు గడిచినా తమ ఖాతాల్లోకి డబ్బులు రాలేదని పలువురు రైతులు అంటున్నారు. బొల్లారంలో 131 రైతుల నుంచి 4,506 క్వింటాళ్లు, తూంకుంటలో 14 మంది రైతుల నుంచి 816 క్వింటాళ్లు, సంగినేనిపల్లిలో 11 మంది రైతుల నుంచి 525 క్వింటాళ్లు, కల్వరాలలో 19 మంది రైతుల నుంచి 924 క్వింటాళ్లు, వల్లభాపురంలో 31 మంది రైతుల నుంచి 1,484 క్వింటాళ్లు, నాగర్లబండ తండాలో 7 మంది రైతుల నుంచి 306 క్వింటాళ్లు, రాయినిపల్లిలో 27 మంది రైతుల నుంచి 290 క్వింటాళ్ల వరిధాన్యానికి ఇప్పటికీ డబ్బులు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సింగిల్ విండో అధికారులను సంప్రదించగా పలు రకాల కారణాలను చూపుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తమకు రావాల్సిన డబ్బులు త్వరగా ఇప్పించాలని రైతులు కోరుతున్నారు. సింగిల్ విండో రామును వివరణ కోరగా రైతులకు సంబంధించి ఓటీపీలు రాకపోవడం వల్లే డబ్బులు ఆలస్యం అవుతున్నాయని త్వరగానే రైతులకు డబ్బులు అందే విధంగా చూస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని నాగరాలకు చెందిన వెంకటయ్య, గట్టయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. శుక్రవారం విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్ర ప్రసాద్‌యాదవ్, వైస్‌ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల, రైతు కమిటీ అధ్యక్షుడు రాములుయాదవ్, వివిధ పార్టీ నాయకులు మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చందు, చంద్రశేఖర్, నరేష్, ఆంజనేయులు, నరసింహ, అనిల్‌కుమార్ ఉన్నారు.

నేడు క్రీడా పోటీలు

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని శనివారం మండలంలోని పామిరెడ్డిపల్లిలో పలు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వివేకానంద యువజన సంఘం సభ్యులు తెలిపారు. మహిళలకు ముగ్గుల పోటీ, చిన్నారులకు స్కిప్పింగ్, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని మకర సంక్రాంతి రోజు బహుమ తులు ప్రదానం చేస్తామని తెలిపారు.

సీఎస్‌గా శాంతికుమారి ఎంపికపై హర్షం

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన శాంతికుమారిని ఎంపిక చేయడంతో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య శుక్రవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి ఎలాంటి రాజకీయ ఉపయోగం కలగలేదన్నారు. ప్రత్యేక తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన గంగుల కమలాకర్, గోవర్ధన్, విజయలక్ష్మి తదితరులకు పదవులు ఇచ్చి గౌరవించారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్, వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరుగుతున్న సింగిరెడ్డి తారకమ్మ స్మారక రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు రెండోరోజు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న యాబ లెవన్ 15 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో షా లెవన్ 11.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసి విజయం సాధించింది. అలాగే ఆర్‌సీసీ క్రికెట్ క్లబ్ మొదట బ్యాటింగ్ ఎంచుకొని 15 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 211 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో లెవల్ క్రికెట్ క్లబ్ 15 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసి రన్నర్‌గా నిలిచింది. మహబూబ్‌నగర్–ముంబై టీం మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ ఎంచుకున్న మహబూబ్‌నగర్ టీం 15 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్‌లో ముంబై 4 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటీ శ్రీధర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ మహేష్, డైరెక్టర్ గిరి, ప్రశాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మహాసభకు బయలుదేరుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

వనపర్తి టౌన్: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభలు రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలో జరుగుతుండటంతో శుక్రవారం ఆ సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో జిల్లా కేంద్రం నుంచి తరలి వెళ్లారు. అంతకుముందు జిల్లా అధ్యక్షుడు ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను, విద్యారంగ సమస్యల పరిష్కారానికి మహాసభ ద్వారా ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీ హమీద్, జ్యోతి, అరుణ, అశ్విని, వెంకటమ్మ, శ్రీనివాస్ గౌడ్, నరేందర్, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. పాపం

బాలింతల మృత్యుఘోష!

- మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రసవం.. ఇద్దరు బాలింతలకు సీరియస్
- హుటాహుటిన గాంధీకి తరలింపు... చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆరోపణ


మృతురాలు సిరివెన్నెల | సిరివెన్నెలకు పుట్టిన పాప


మృతురాలు శివాని | శివానికి పుట్టిన మగబిడ్డ

సాక్షి, హైదరాబాద్/మలక్‌పేట్/గాంధీ ఆస్పత్రి: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ చికిత్సలు వికటించి నలుగురు మహిళలు మృతి చెందిన అంశాన్ని ఇంకా పూర్తిగా మరిచిపోక ముందే..తాజాగా గురువారం రాత్రి మలకోపేట ఏరియా ఆస్పత్రిలో ప్రసవించిన ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. కేవలం గంట వ్యవధిలోనే ఆ ఇద్దరు తల్లులు కన్నుమూయడం విషాదం నింపింది. సిజేరియన్‌కు ముందు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయకపోవడం, వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం, సిజేరియన్ చేసిన ప్రదేశాన్ని సరిగా శుభ్రం చేయకుండానే కుట్లు వేయడం వల్లే మృతిచెందారని బంధువులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని టీవీవీపీ కమిషనర్ హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అయితే ఈ మొత్తాన్ని తీసుకునేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఇదిలా ఉంటే శుక్రవారం ఉదయం డీఎంఈ రమేష్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటిలు గాంధీకి చేరుకుని సూపరింటెండెంట్ రాజారావు సహా, గైనకాలజీ వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమై బాలింతల మృతికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీశారు.

రెండో కాన్పుకోసం వచ్చిన సిరివెన్నెల

నాగర్‌కర్నూలు జిల్లా వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన పోలే మహేష్ భార్య సిరివెన్నెల (25) రెండో కాన్పు కోసం సోమవారం ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆమెకు బుధవారం సిజేరియన్ చేశారు. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాతి కొద్దిసేపటికే పల్స్ రేట్ ఒక్కసారిగా పడిపోయింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అత్యవసర వైద్య సేవల పేరుతో వైద్యులు ఆమెను గాంధీకి తరలించారు. 2డీ ఎకో పరీక్ష సహా ఇతర వైద్య పరీక్షలు చేశారు. గురువారం రాత్రి పది గంటలకు మరణించింది. అయితే ఆమె గత ఐదు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రి వైద్యులు ఈ విషయాన్ని గుర్తించకుండా ఆమెకు సిజేరియన్ చేయడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడానికి కారణమయ్యారని మృతురాలి భర్త మహేష్ ఆరోపించారు. వీరికి ఏడాదిన్నర పాప కూడా ఉంది. తల్లి లేదని తెలిసి ఆ పాప గుక్కపట్టి ఏడుస్తుండగా...అప్పుడే పుట్టిన శిశువు కనీసం ముర్రుపాలకు కూడా నోచుకోలేదు.

తొలి కాన్పు కోసం వచ్చిన శివాని

సైదాబాద్ పూసలబస్తీకి చెందిన రవీందర్, వెంకటలక్ష్మి కుమార్తె శివాని(25) మొదటి కాన్పు కోసం కుటుంబ సభ్యులు ఆమెను ఈనెల 10 తేదీన ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా.. వైద్యులు బుధవారం ఉదయం సిజేరియన్ చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆమె అకస్మాత్తుగా విరేచనాలతో బాధపడింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అయితే బాలింత మరణానికి థైరాయిడ్ కారణమని వైద్యులు చెబుతుండగా, సిజేరియన్ తర్వాత కుట్లు వేసే సమయంలో సరిగా శుభ్రం చేయక పోవడం వల్లే తన భార్య చనిపోయిందని, ఆరోగ్యంగా ఉన్న తన భార్య మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె భర్త జగదీష్‌కుమార్ ఆరోపించారు.

ఆందోళనలు..ఆర్తనాదాలు

వైద్యుల నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మృతుల బంధువులు ఆరోపించారు. కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు మలక్‌పేట్ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు.బాధితుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు భారీగా అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శిశువులను నిలోఫర్ ఆస్పత్రికి తరలించేందుకు వాహనం సమకూర్చినా తీసుకెళ్లేందుకు నిరాకరించారు. శిశువులను చూపిస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు.బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు బాధిత కుటుంబాలకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం వికటించి ఇద్దరు బాలింతలు మృతి చెందిన ఘటన అత్యంత దారుణమని, ఈ ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. హైదరాబాద్ చుట్టూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు కడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. కనీసం బాలింతలను కాపాడలేకపోతోందని విమర్శించారు.

చర్యలు తీసుకుంటాం

ఈ ఘటనపై నిపుణుల కమిటీతో విచారణ చేయిస్తాం. కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో 11 మంది డెలివరీ కాగా వీరిద్దరూ మినహా మిగతా వారంతా ఆరోగ్యంగా ఉన్నారు.
– టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

అధ్యయనం చేస్తున్నాం

ఇద్దరు బాలింతల మరణాలకు గల కారణాలపై అధ్యయనం చేస్తున్నాం. మృతుల హెల్త్ రిపోర్ట్, మలక్‌పేట ఆస్పత్రిలో అందించిన వైద్యం, పోస్టుమార్టం నివేదిక తదితర అంశాలను క్రోడీకరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తాం.
– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ

నిమ్స్‌కు మరో ఎనిమిది మంది..

మలక్‌పేట్ ఏరియా హాస్పిటల్‌లో ఇద్దరు బాలింతల మృతితో వైద్యారోగ్యశాఖ అలర్ట్ అయింది. ఏ ఒక్కరికి ఇబ్బంది కాకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. దానికి గల కారణాలపై ఆరా తీసింది. మొత్తం 10 మందికి సిజేరియన్లు జరగ్గా ఇందులో ఇద్దరు మృతి చెందారని, మెరుగైన వైద్యం కోసం మిగతా 8 మంది బాలింతలను నిమ్స్‌కు తరలించారు.


ఏరియా ఆసుపత్రి ఆవరణలో బంధువుల రోదనలు

ఉన్నత విద్యలో 'షేరింగ్'

విద్యా సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకునే విధానానికి శ్రీకారం

- నాలెడ్జ్ షేరింగ్, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్‌కి వీలుగా నిర్ణయం
- యూజీ, పీజీ, పరిశోధన కోర్సుల్లో అమలు
- అదనపు పెట్టుబడి అవసరంలేకుండా దగ్గర్లోని సంస్థల వనరుల వినియోగం
- ల్యాబ్‌లు, లైబ్రరీ, తరగతి గదులు ఇతర సదుపాయాలు పంచుకోవచ్చు
- ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు



సాక్షి, అమరావతి: సెంట్రల్ వర్సిటీలు సహా దేశంలోని అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోని వనరులను సద్వినియోగం చేయడం, సమీపంలోని ఇతర ఉన్నత విద్యాసంస్థలు కూడా వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి వీలుగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) 'షేరింగ్' విధానానికి శ్రీకారం చుట్టింది. వివిధ సదుపాయాలతో పాటు అత్యున్నత ప్రమాణాలతో కూడిన బోధన ఇతర అంశాల్లో విద్యా సంస్థల మధ్య ఇచ్చిపుచ్చుకునే ధోరణికి తెరతీసింది. నాలెడ్జ్ షేరింగ్, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్‌కి వీలుగా టెక్నాలజీని, ఇతర వనరులను ఆయా సంస్థలు ఉమ్మడిగా వినియోగించుకునేందుకు ఈ విధానం దోహదపడనుంది. ఈ మేరకు సెంట్రల్ వర్సిటీలు సహా అన్ని ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశాలు జారీచేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్–గ్రాడ్యుయేట్ కోర్సులతో పాటు పరిశోధన కోర్సుల్లోనూ దీన్ని అమలుచేయాలని సూచించింది. వనరులు లేని విద్యాసంస్థలు వాటిని ఏర్పాటుచేసుకునేందుకు అదనపు పెట్టుబడి పెట్టాల్సిన అవసరంలేకుండా దగ్గర్లోని విద్యా సంస్థల వనరులను వినియోగిస్తూ తమ విద్యార్థులను ఆయా సంస్థలు తీర్చిదిద్దడానికి ఈ విధానంతో వీలుపడుతుంది.

రెట్టింపు ఫలితాలు

ఈ విధానంవల్ల రెట్టింపు ఫలితాలు వస్తాయని యూజీసీ భావిస్తోంది. అకడమిక్ అంశాలు సహా ఏదైనా అభివృద్ధి కార్యకలాపాలను సమగ్రంగా అమలుచేయాలంటే అదనపు సదుపా యాలు అవసరమవుతుంటాయి. ఇందుకోసం ఆయా సంస్థలు అదనపు పెట్టుబడి పెట్టాలి. అలా కాకుండా.. ఇప్పటికే ఉన్న వనరులను సమర్థంగా ఉపయోగించడంవల్ల రెట్టింపు ఫలితాలు వస్తాయి. ఉన్నత విద్యాసంస్థలు పరస్పర సహకారంతో విద్యాపరమైన మౌలిక వనరులను పంచుకోవడం వల్ల విద్యార్థులకు సమానమైన విద్య అందుతుంది. ప్రస్తుతం ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఇతర వనరులున్న సంస్థల్లో చదివే వారికి ఆ వనరుల ద్వారా ఉత్తమ బోధన లభిస్తుంది. కానీ, అలాంటివిలేని సంస్థల విద్యార్థులకు ఉన్నత బోధన దూరమవుతోంది. వనరులను పంచుకునేలా ఆయా సంస్థల మధ్య జరిగేఒప్పందాలతో విద్యార్థులందరికీ మేలు చేకూరుతుంది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్–గ్రాడ్యుయేట్, పీహెచ్‌డీ కోర్సులన్నిటికీ ఈ విధానాన్ని అమలుచేయాలని యూజీసీ సూచించింది. ఆయా విద్యాసంస్థలన్నీ తమ సంస్థలోని తరగతి గదులు, ల్యాబ్‌లు ఇతర వనరుల సమాచారాన్ని సమీపంలోని ఇతర ఉన్నత విద్యాసంస్థలన్నిటికీ తెలిసేలా వెబ్‌సైట్ ద్వారా తక్షణమే అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. వీటిని వినియోగించుకోవాలనుకునే ఇతర ఉన్నత విద్యా సంస్థల నుంచి నిర్దిష్ట వనరులకు సాధారణ కనీస చార్జీలు నిర్ణయించి వసూలుచేయవచ్చని సూచించింది. ఆ కనీస చార్జీల వివరాలూ అందుబాటులో ఉంచాలని స్పష్టంచేసింది.

సంస్థల మధ్య ఒప్పందాలు

ఇక ఉన్నత విద్యా సంస్థల్లోని వనరులను పరస్పర భాగస్వామ్యంతో వినియోగించుకునేందుకు వీలుగా ఆయా సంస్థలు ఎంఓయూ కుదుర్చుకోవాలని యూజీసీ పేర్కొంది. ఏ సమయంలో ఏ సంస్థ విద్యార్థులు వనరులు వినియోగించుకోవాలో సమగ్ర టైమ్‌టేబుల్‌ను రూపొందించి ఆ ప్రకారం కార్యక్రమాలకు కమిటీలను ఏర్పాటుచేసుకోవాల్సి ఉంటుంది. తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర వనరులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా సంస్థలు చర్యలు చేపట్టాలని, ఏ ఒక్క తరగతి ఖాళీగా ఉండకుండా చూసుకోవాలని యూజీసీ సూచించింది.

ఈ విధానంతో విద్యార్థులకు మేలు..

తరగతి గదులు, మౌలిక సదుపాయాలు పంచుకోవడం ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుంది. క్రీడా మైదానాలు, స్టేడియం, సమావేశ మందిరాలను కూడా అవసరాలను అనుసరించి పంచుకోవచ్చు. సైన్సేతర అంశాలకు సంబంధించిన వనరుల విషయంలో కూడా సంస్థలు పూర్తిస్థాయిలో తమ వద్ద ఉన్న అన్ని సదుపాయాలను ఇతర సంస్థలకు అందుబాటులో ఉంచాలని యూజీసీ పేర్కొంది. పరికరాలు దెబ్బతినే విషయంలోనూ వాటిని తిరిగి ఏర్పాటు చేయడంపైనా ఒప్పందంలో పేర్కొనాలి. అకడమిక్ అంశాలకు సంబంధించి ఆన్‌లైన్ లెక్చర్‌లు, వీడియోలు, లెర్నింగ్ మెటీరియల్‌లు, ఎల్ఎంఎస్ (లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్)లలోనూ ఇచ్చిపుచ్చుకోవచ్చు. విద్యార్థుల నమోదు ప్రక్రియ మొత్తం ముందుగా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్ ద్వారా పూర్తిచేయాలి. ఉపాధ్యాయుల శిక్షణ, ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాలు కూడా నిర్వహించవచ్చు.

ఖర్చులపై ముందుగానే ప్రణాళిక

వనరులను పంచుకోవడానికి ముందు వ్యయ విశ్లేషణ, ఖర్చును నిర్ణయించే పద్ధతులపై ప్రణాళిక రూపొందించుకోవాలి. లాభనష్టాలకు తావులేని రీతిలో వనరుల వినియోగంపై ఛార్జీలు వసూలుచేయాలి. ప్రయోగాల వినియోగం ఆధారంగా, నిర్వహణ వ్యయం ప్రకారం పరికరాలు ఛార్జీలు నిర్ణయించాలి. ఉన్నత విద్యాసంస్థల మధ్యే కాకుండా కాలేజీలు, పరిశ్రమల మధ్య కూడా ఇలాంటి ఒప్పందాలు చేసుకోవాలి. నాలెడ్జ్ షేరింగ్, నాలెడ్జ్ ట్రాన్స్‌ఫర్, టెక్నాలజీ వినియోగాన్ని సంస్థలు ప్రోత్సహించాలని యూజీసీ సూచించింది.

యూజీసీ పేర్కొన్న ఇతర సూచనలివే..

- ఆయా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీచేయాలి.
- తరగతి గది బోధకులు, ల్యాబ్ అసిస్టెంట్‌లు, సెక్యూరిటీ సిబ్బందికి అదనపు చెల్లింపులతో పాటు నిర్వహణ ఖర్చులలో ఆయా సంస్థలు భాగస్వామ్యం కోసం రూపొందించిన ఫార్ములాను అనుసరించాలి.
- ఒకే నగరం, పట్టణం లేదా సమీప ప్రాంతాల్లో ఉండే ఉన్నత విద్యాసంస్థల మధ్య ఈ పరస్పర సహకారం ఉండాలి.
- పరిశోధన స్థాయిలో వనరుల భాగస్వామ్యం అనేది ఆయా పరిశోధకుల స్థాయిలో ఉండాలి. పీజీ స్థాయిలో వనరుల షేరింగ్ విభాగాల వారీగా లేదా సంస్థాగతస్థాయిలో ఉండొచ్చు.
- అదే యూజీ స్థాయిలో వనరుల భాగస్వామ్యం సంస్థల మధ్యే ఉండాలి.
- సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సదుపాయం వంటి హైఎండ్ పరికరాల భాగస్వామ్యంలో లాభనష్టాలు లేనివిధంగా ఒప్పందాలు ఉండాలి.
- లైబ్రరీ, రీడింగ్ హాళ్ల ఆవరణ స్థలాలు తదితర వనరులనూ ఇదేరకంగా వినియోగించుకోవాలి.
- ఇ-బుక్స్, డేటాబేస్‌లు, ఆన్‌లైన్ వనరుల భాగస్వామ్యంలో కాపీరైట్ ఉల్లంఘనలకు తావులేకుండా, గోప్యతకు భంగం కలగని రీతిలో వ్యవహారాలు నడిచేలా సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో యాంటీ–ప్లాజియరిజం సాఫ్ట్‌వేర్‌తో సహా ఎలక్ట్రానిక్ వనరులను వినియోగించాలి.

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలని వినతి



అమ్రాబాద్: అచ్చంపేట జేఎంజే పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మండలంలోని మాధవానిపల్లికి చెందిన ఆకాష్ మృతిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని శుక్రవారం తల్లి మణెమ్మ, అన్న శ్రీరాం కలెక్టర్, ఎస్పీలకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో మా కుమారుడు ఉరేసుకొని మృతిచెందడం అనుమానాలకు తావిస్తోందని.. విచారణ జరిపి యాజమాన్యం, సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు రూ.20 లక్షల పరిహారం ఇప్పించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని ఆలిండియా యువజన కాంగ్రెస్ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఖాలిద్ అహ్మద్ అన్నారు. 'యూత్ జోడో– బూత్ జోడో'పై జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం అసెంబ్లీస్థాయిలో యువజన కాంగ్రెస్ నాయకుల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూత్‌జోడో భారత్‌జోడో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ప్రత్యేక యూత్ జోడో బూత్‌జోడో మొబైల్ యాప్‌లో ప్రతి బూత్ నుంచి ఐదు మంది సభ్యులను చేర్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో యువజన కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయిలో మరింతగా బలోపేతం చేయడానికి సభ్యులు కృషి చేయాలని కోరారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడోయాత్రలో యువత ముందుండి పాల్గొన్నట్లు చెప్పారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరుణ్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుయాదవ్, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హక్, కార్యదర్శి గిరియాదవ్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు రాఘవేందర్, వెంకట్‌నాయక్, శ్రీశైలం యాదవ్, రఘు, అనిల్‌రెడ్డి, జాకీర్, షంషుద్దీన్, బాలు, బంగారయ్య, రమేష్‌నాయక్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బియ్యం.. ఐదు కిలోలే!



- చౌకధర దుకాణాల్లో మొదలైన పంపిణీ
- రాష్ట్ర వాటాపై ఇంకా సందిగ్ధం
- డిసెంబర్‌తో ముగిసిన పది కిలోల బియ్యం పంపిణీ
- జిల్లాలో 8,08,422 మంది లబ్ధిదారులు

మహబూబ్‌నగర్ రూరల్: సంక్రాంతి పండుగకు రేషన్ బియ్యం పంపిణీ ఉంటుందా? లేదా అనే సందిగ్ధం వీడింది. రాష్ట్ర కోటాపై ఇప్పటి వరకు స్పష్టత లేకపోయినా కేంద్రం ప్రకటించిన ఒకరికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీని చౌకధర డీలర్లు ప్రారంభించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా ఆరు కిలోల చొప్పున బియ్యాన్ని ఇచ్చేది. కోవిడ్ ఆపత్కాలంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఐదు కిలల చొప్పున బియ్యాన్ని అందించగా, దానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐదు కిలోల చొప్పున బియ్యం కలిపి పది కిలోలు పంపిణీ చేశారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం 5 కిలోల చొప్పున బియ్యాన్ని మరో సంవత్సరం కాలం పొడిగించింది. 7వ తేదీ నుంచి బియ్యాన్ని పంపిణీ చేస్తామని ప్రకటించినా కొత్త సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని పంపిణీని నిలిపివేశారు. ఇదే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అందించే బియ్యం వాటా కూడా తేలకపోవడంతో లబ్ధిదారులు నిరాశ చెందారు. తాజాగా గతంలో పేదలకు అందించే ఆరు కిలోల్లో ఒక కిలో బియ్యం కోత పడింది. దీనిపై స్పష్టత లేకపోయినా ప్రస్తుతం ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభించారు. గత నెల డిసెంబర్ వరకు పది కిలోల ఉచిత బియ్యాన్ని అందుకున్న వారు తిరిగి పది కిలోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

4,393.390 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు

జిల్లాలో 506 చౌకధర దుకాణాల్లో 2,39,956 రేషన్‌కార్డులు ఉన్నాయి. 8,08,422 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ఐదు కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేసేందుకు 4,393.390 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న కార్డుల్లో ఆహార భద్రత 2,20,644 ఉండగా, అంత్యోదయ 18,956, అన్నపూర్ణ కార్డులు 205 ఉన్నాయి.

జాడలేని కొత్త దుకాణాలు

జిల్లాలో గిరిజనతండాలు పంచాయతీలుగా మారాయి. చిన్న అనుబంధ గ్రామాలు, పంచాయతీలుగా మార్చినా ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ బియ్యం అందించడానికి వీలుగా కొత్తగా చౌకధర దుకాణాలు మాత్రం ఏర్పాటు చేయడం లేదు. కొత్త జీపీల ఆధారంగా రేషన్ దుకాణాలు నెలకొల్పాలని డిమాండ్ ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదు. రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని లబ్ధిదారులు చెబుతున్నారు.

రాయితీపై సరుకులు అందించాలి

గతంలో చౌకధర దుకాణాల ద్వారా పప్పులు, చక్కెర, గోధుమలు, ఇతర సరుకులు రాయితీపై అందించేవారు. ప్రస్తుతం కేవలం బియ్యానికే పరిమితం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రభుత్వమే రాయితీపై వంట నూనె, పప్పులు, గోధుమలు, ఇతర నిత్యావసర సరుకులు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

- 2020లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు లబ్ధిదారుడికి 12 కిలోల చొప్పున, జులై నుంచి నవంబర్ వరకు ప్రతి లబ్ధిదారుడికి 10 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేశారు. మళ్లీ 2021 జూన్ నుంచి 2022 జూలై వరకు పది కిలోల చొప్పున, ఆగస్టు, సెప్టెంబర్‌లో 15 కిలోల చొప్పున కేటాయించారు.

అన్ని సరుకులు ఇవ్వాలి



సంక్రాంతి పండుగ సందర్భంగా రేషన్ షాపు ద్వారా అన్ని సరుకులు పంపిణీ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 9 రకాల సరుకులు వచ్చేవి. బీఆర్ఎస్ వచ్చాక అన్నింటిని నిలిపేసింది. బియ్యం ఒక్కటే ఇస్తుంది. అవి కూడా సకాలంలో ఇవ్వలేకపోతుంది. పండుగకు నిరుపేద ప్రజలకు సబ్సిడీపై పప్పు, ఉప్పు, నూనె వంటి సరుకులు పంపిణీ చేయాలి.
– నాగరాజు, పాతపాలమూరు, మహబూబ్‌నగర్ పట్టణం

రిమాండ్‌కు యువకుడు

మహబూబ్‌నగర్ క్రైం: ఓ మతానికి చెందిన దేవుడిని కించపరిచే విధంగా వాట్సాప్ స్టేటస్ పెట్టుకున్న యువకుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ శివారులోని ఎదిరకు చెందిన ఓ యువకుడు పెట్టుకున్న స్టేటస్ తమ దృష్టికి రావడంతో వెంటనే చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా ఒక వర్గాన్ని గాని.. ఒక మతాన్ని గాని కించపరిచే విధంగా.. మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక డంప్‌లు స్వాధీనం

పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో కృష్ణానది తీరం నుంచి కొందరు వ్యక్తులు ఇసుకను అక్రమంగా తరలించి వ్యవసాయ భూమిలో నిల్వ చేసినట్లు సమాచారం అందడంతో డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, ఏఎస్ఐ జయరాములు, వీఆర్ఏ అక్కడికి చేరుకొని సుమారు 26 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను సీజ్ చేశారు. వీఆర్ఏ, గ్రామ పోలీసులకు అప్పగించడంతో పాటు మైనింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని.. వారి సూచన మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్న అధికారులు

మాయమాటలు నమ్మి మోసపోవద్దు


మాట్లాడుతున్న జడ్జి సంధ్యారాణి

మహబూబ్‌నగర్ రూరల్: బాలికలు మాయమాటలు చెప్పే వ్యక్తుల చేతిలో మోసపోవద్దని, ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తల్లిదండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ సమాచారం ఇవ్వాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలోని రాష్ట్ర సదనం, బాలసదన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో జడ్జి మాట్లాడుతూ బాలికలు చదువుపై దృష్టిసారించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. విద్య ద్వారానే పేదరికం రూపుమాపవచ్చని అన్నారు. చదువుకు ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు తగిన భద్రత కల్పించేలా పోలీస్ శాఖ పని చేస్తుందని చెప్పారు. డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే తగిన రక్షణ కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకుంటారని వివరించారు. అలాగే విద్యార్థినులను ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలను కట్టడి చేసేందుకు షీటీమ్స్ మహిళల రక్షణ కోసమే పని చేస్తున్నాయని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనవసరంగా ఇతరుల మాయమాటలకు మోసపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని, చదువుపై దృష్టిసారించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. అంతకు ముందు షీటీం కళాబృందాల ద్వారా మహిళల భద్రతపై పాటలు పాడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల సదనం సూపరింటెండెంట్ యాదమ్మ, డీసీపీఓ నర్మద, జేజేబీ సభ్యులు గ్రేస్, గిరిజ, సీడీపీఓ లక్ష్మి, షీటీం సభ్యులు రాములు, నాగరాజు, పీఎల్వీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రిని బర్తరఫ్ చేయాలి


గిరిజనులను కొడుతున్న బీఆర్ఎస్ నాయకుల ఫొటోలు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

- మార్కండేయ పంచాయితీని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తాం
- కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్

కందనూలు: గిరిజన ప్రజలపై బీఆర్ఎస్ గుండాల చేత దాడి చేయించిన ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాంనాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రోత్సాహంతోనే బీఆర్ఎస్ గుండాలు కాంగ్రెస్ నాయకులపై దాడిచేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. ఎమ్మెల్యే మర్రిని పదవి నుంచి బర్తరఫ్ చేయడంతోపాటు పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేయించిన, చేసిన వారిని రౌడీలే అంటారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ బలరాంనాయక్ మాట్లాడుతూ మార్కండేయ పంచాయితీ నియోజకవర్గ సమస్య కాదని, ఇది రాష్ట్ర సమస్య అన్నారు. మార్కండేయ ప్రాజెక్టు సందర్శన సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనను రాష్ట్రపతి, గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ నెల 16న హెచ్ఆర్సీ, హోంశాఖను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఎస్సీ, ఎస్టీలతో దండోరా వేయించి, అక్కడే సామూహిక భోజనం చేసి, ఇస్తరాకులు క్యాంపు కార్యాలయంలో పడేస్తామని హెచ్చరించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌లాల్ మాట్లాడుతూ వేలాది మంది గిరిజన, దళితులతో బిజినేపల్లిలో బహిరంగ సభ నిర్వహించి, ఐక్యత చాటుతామన్నారు. నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ తమ నాయకులను తమ ముందే పండబెట్టి విచక్షణ రహితంగా కొట్టారని ఆరోపించారు. అక్కడే పోలీసులు ఉన్నా.. ఆపే ప్రయత్నం చేయకపోవడం దుర్మార్గం అన్నారు. బిజినేపల్లి ఎస్ఐ ఓబుల్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్థం రవి, నాయకులు పాండు, మల్లయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.